క్లుప్తంగా

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



జడ్చర్ల టౌన్: న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జడ్చర్లలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా జడ్చర్ల బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ న్యాయవాదులను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను ఖండించారు. న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయని, అరికట్టాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాలిక్‌షాకీర్, యాదిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కరీం, విశ్వేశ్వర్, రాములు, రమేష్, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, తిరుపతి పాల్గొన్నారు.

సామగ్రి అందజేత

నవాబుపేట: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజక పథకం ద్వారా లబ్ధిదారులకు అందించే పనిముట్లను మంగళవారం అందించారు. ఈ సందర్భంగాగా లబ్ధిదారులకు నేరుగా వచ్చిన కిట్లను స్థానిక నాయకులు పంపిణీ చేశారు. వారికి కులవృత్తుల వారీగా దాదాపుగా 3 లక్షల రూపాయల విలువ చేసే పని ముట్లను ఈ పథకంద్వార వారికి అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాస్, లోకిరేవు బాలయ్య, కామారం కృష్ణయ్య, రామకృష్ణ, యాదయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

పీయూ అధ్యాపకురాలికి డాక్టరేట్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ (పీయూ) పర్యావరణశాస్త్ర విభాగం అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న జయరాజ్ కోమల్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈమేరకు ఆమె గైడ్ ప్రొఫెసర్ సైదా అజీమ్ ఉన్నిసా ఆద్వర్యంలో 'హైద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో కారంపొడి కల్తీని ఏ విధంగా చేస్తున్నారు' అనే అంశంపై ఆమెచేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా జయరాజ్ కోమల్‌ను పీయూ వీసీ శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, రవికాంత్, ఈశ్వర్‌కుమార్, సోమేశ్వర్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



పాలమూరు: బెక్కరి బాలకిష్టారెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని రెడ్డి సేవా సమితి ఫంక్షన్ హాలులో పేదలకు బెక్కరి రాంరెడ్డి చీరలు పంపిణీ చేశారు. పదిమంది కళాకారులకు డప్పులు అందజేశారు. కార్యక్రమంలో బెక్కరి జయలక్ష్మి, యమున, విజయ, పాలమూరు రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు..

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో ప్రముఖ సమాజ సేవకులు, బీఆర్‌ఎస్ నాయకుడు షేక్ అబ్దుల్ జాంగీర్ మంగళవారం పేద ముస్లిం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. 100మంది పేదముస్లిం మహిళలను గుర్తించి వారికి చీరలను పంపిణీ చేసినట్లు షేక్ అబ్దుల్ జాంగీర్ తెలిపారు.

రేషన్ దుకాణాల తనిఖీ

దేవరకద్ర: మండలంలోని పెద్దరాజమూర్, బలుసుపల్లి గ్రామాల్లోని రేషన్ షాపులను మంగళవారం తహసీల్దార్ కృష్ణయ్య తనిఖీ చేశారు. రేషన్‌షాపుల్లో ఉన్న స్టాకు బోర్డులను పరిశీలించి షాపులో ఉన్న స్టాకులను సరి చూశారు. అలాగే రిజిస్టర్‌ను పరిశీలించి డీలర్లతో వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రతి రోజు ప్రకటించిన వేళల ప్రకారం షాపులను తెరవాలని సూచించారు. ప్రభుత్వం ద్వార వచ్చే బియ్యం, ఇతర సరుకులను సక్రమంగా అందించాలని తెలిపారు. ఆర్ఐ శరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెస్ కిట్లు

మిడ్జిల్: మండలంలోని కాలోనిగడ్డతండాలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం చెస్ కిట్లు అందజేసినట్లు గ్రామానికి చెందిన యువకుడు లక్ష్మణ్ పవార్ తెలిపారు. చెస్ ద్వారా విద్యార్థుల మేదస్సు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసం..



మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- ఇష్టారాజ్యంగా దస్తావేజు లేఖరులు
- అడ్డుకట్ట వేస్తున్న సబ్ రిజిస్ట్రార్
- పనులు ఆలస్యమవుతున్నాయని విమర్శలు
- డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఆరోపణలు

మెట్టుగడ్డ: జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆధిపత్యం కోసం దస్తావేజు లేఖరులు పాకులాడుతున్నారు. ప్రతి పనిలో తమ ప్రమేయం ఉండాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ వీటికి బ్రేక్‌లు వేశారు. అవసరం ఉన్నమేరకు కార్యాలయంలో ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి నిత్యం రిజిస్ట్రేషన్ల కోసం ఎన్నో దరఖాస్తులు వస్తుంటాయి. దీంతో పనులు త్వరగా చేయాలని దస్తావేజు లేఖరులు ఇక్కడి సిబ్బందిపై ఆజమాయిషీ చేస్తున్నారు. కాగా వచ్చే ప్రతి దరఖాస్తును సబ్ రిజిస్ట్రార్ క్షుణ్ణంగా పరిశీలించాకే ముందుకు పంపుతున్నారు. దీనికి గంటల కొద్దీ సమయం పడుతుంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కావాలనే ఆలస్యం చూస్తున్నారంటూ దస్తావేజు లేఖరులు విమర్శిసూ ఉన్నారు. కాగా ఇటీవలే సబ్ రిజిస్ట్రార్‌పై కొందరు పనిగట్టుకొని కొన్ని విషయాలపై దుష్ప్రచారం చేస్తున్నట్లు సమాచారం. రైటర్స్, వారి వద్ద పని చేసే పిల్లలు అనవసరంగా లోపలకు రావొద్దని, అమ్మకపు, కొనుగోలుదారులనే కార్యాలయంలోకి దస్తావేజులు ఇచ్చి పంపాలని అధికారులు చెబుతున్నారు. కాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది పనులకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ విమర్శలు గుప్పుమంటున్నాయి.

"

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులేవు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నాం. ఎల్ఆర్‌ఎస్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ప్రతి దస్తావేజును ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తున్నాం. ప్రజలతో పాటు దస్తావేజు లేఖరుల దగ్గర పనిచేసే వారు అధికంగా కార్యాలయంలో గుమికూడటం ఇబ్బందికరంగా ఉంది. డబ్బుల కోసం ఎవరిని ఇబ్బంది పెట్టలేదు.

– మొహమ్మద్ హమీద్, సబ్ రిజిస్ట్రార్.

వినియోగదారుల హక్కుల రక్షణే ముఖ్యం

- జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ బాలరాజు



కలెక్టర్ విజయేందిర బోయిని కలిసిన వినియోగదారుల హక్కుల కమిషన్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వినియోగదారుల హక్కుల పరిరక్షణమే ముఖ్యమని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ బూనీడు బాలరాజు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌లను కలిసి సంఘం జిల్లా కొత్త కమిటీని పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే జిల్లా కేంద్రంలో వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నామన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా మడుగు శివశంకర్, మహబూబ్‌నగర్ జిల్లా చైర్మన్‌గా మాడమోని చందు, ఉపాధ్యక్షులుగా రాజసింహుడు, మాధవీలత, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణ, కార్యదర్శిగా సి.కృష్ణయ్య, కార్యవర్గసభ్యులుగా రషీద్, పర్వేజ్, అఫ్సర్, ముజాహిద్, లీగల్ అడ్వయిజర్‌గా ఆడమ్స్‌ను ఎన్నుకున్నామన్నారు.

బోరు తవ్వకాన్ని అడ్డుకున్న కౌన్సిలర్



ఊరచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేస్తున్న బోరు

జడ్చర్ల టౌన్: ఊరచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మంగళవారం ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం బోరు డ్రిల్లింగ్ చేస్తుండగా వార్డుకౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి వెళ్లి అడ్డుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 23వవార్డులో ఉన్న ఊరచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొన్ని ప్లాట్లుగా చేసి విక్రయించారు. వాటిలో తిమ్మాజిపేట మండలానికి చెందిన వెంకటయ్య గౌడ్ అనే వ్యక్తి ప్లాటు చదునుచేసి బోరు వేయటం ప్రారంభించారు. ఈవిషయాన్ని గుర్తించిన స్థానికులు కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, ఉమాశంకర్ గౌడ్‌లకు సమాచారం అందించారు. వారు మున్సిపాలిటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అతడు స్పందించేలోగానే వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలకు అనుమతులు లేవని, బోరు వేసేందుకు ఏవైనా అనుమతి తీసుకున్నారా అని తెలుసుకున్నారు. అయితే అనుమతులు లేవని తెలియటంతో బోరు వేయటాన్ని నిలిపివేయించారు. కమిషనర్ సైతం సిబ్బందిని పంపించి బోరు వేయటం ఆపివేయాలని సూచించారు.

విత్తన ప్రాసెసింగ్ యూనిట్లలో తనిఖీలు

భూత్పూర్: మండల కేంద్రంలోని పత్తి విత్తన ప్రాసెసింగ్ యూనిట్లలో మంగళవారం వ్యవసాయాధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావు, జీవనియంత్రణ ఏడీఏ ఆంజనేయులుగౌడ్, స్థానిక వ్యవసాయాధికారి మురళీధర్, అడ్డాకుల ఏఓ బ్యూలాలు సాయిభవ్య, సుదీవ్య, సికాప్, సోనా ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, డీసీలు, టీసీలు, స్టాక్ నిల్వలు తనిఖీచేసి హెచ్‌టీ టెస్టులు చేశారు. ఎలాంటి బీటీ3 నిల్వలు లేవని అధికారులు వివరించారు.

రాజీవ్ యువ వికాసంకు దరఖాస్తు చేసుకోండి

నవాబుపేట: యువతకు ఉపాధి కోసం ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించి యువతకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. దీని ద్వారా వివిధ రంగాల్లో వారికి ఆర్థిక సాయం అందించి ఉపాధి చూపనుంది. అర్హత గల యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఒక కాపీని మండల కార్యాలయంలో అందించాలన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ పాటించాలి



చిన్నచింతకుంట: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది ఫ్రెండ్లీ పోలీసింగ్ పాటించాలని డీసీపీ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది ముందుగా గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన స్టేషన్‌లోని పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించారు.పోలీస్ సిబ్బంది పనితీరు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను త్వరగతిన పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినులు ఉన్నతశిఖరాలకు చేరాలి



రాజాపూర్: విద్యార్థినులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేదిశగా తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నతశిఖారాలకు చేరాలని ఎస్ఐ శివానందంగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో నిర్వహించిన జనచైతన్య మోటివేషన్ క్లాస్‌లో ఆయన పాల్గొని విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎంఈఓ సుధాకర్, అడ్వకేట్ అశోక్‌గౌడ్, రాజాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కేజీబీవీ సీఆర్‌టీ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

త్రిమెన్ కమిటీ సభ్యుడిగా నాగరాజుస్వామి



దేవరకద్ర: దేవాదాయ ధర్మదాయ శాఖ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దూపదీప నైవేద్యం పథకం దేవాలయాల త్రిమెన్ కమిటీ సభ్యుడిగా ఈశ్వర వీరప్పయ్య స్వామి పూజారి నాగరాజుస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యునిగా ఎన్నికయినట్లు దేవాదాయ శాఖ నుంచి వెలువడిన ఉత్తర్వుల కాపీని నాగరాజుస్వామికి అందజేశారు.

ఐకమత్యంతో పండుగలు చేసుకోవాలి



ఇఫ్తార్‌లో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణలో అందరు కలిసి ఐకమత్యంతో పండుగలు జరుపుకునే అనవాయితీ ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మదీనాబసీద్, మోనప్పగుట్ట, నూర్‌మసీద్, పోలీస్‌లైన్, వివేకానంద ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ముడా మాజీ చైర్మన్ గండివెంకన్న, అన్వర్‌పాషా, మక్సుద్, ఖలీమ్, మోసిన్‌ఖాన్, ఇమ్రాన్, జావేద్‌బేగ్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో బీజేపీ నాయకుల ఇఫ్తార్

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని మసీదులో మంగళవారం బీజేపీ నాయకుడు, మాజీ సర్పంచ్ అమ్మిక భాస్కర్ చందర్‌గౌడ్ ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటుచేశారు. ఉపవాసదీక్షలు ఉన్న ముస్లింలకు పండ్లను తినిపించి దీక్షలను విరమింపజేశారు. మసీద్ కమిటీ నాయకులు టైలర్ మైనోద్దిన్, హోటల్ ఖాదర్, టైలర్ కలీం, ముక్తార్ ఉన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా పాలమూరు



మాదక ద్రవ్యాల నిరోధక పోస్టర్‌ను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): డ్రగ్స్ రహిత జిల్లాగా పాలమూర్‌ను మార్చాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మాదకద్రవ్యాల నిరోధక జిల్లాకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా కమిటీల నేతృత్వంలో మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగామన కల్పించాలన్నారు. అన్నిశాఖల అధికారులు మాదకద్రవ్యాల నిషేధంపై క్షేత్ర స్థాయిలో నిఘా పెట్టాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిరోధక పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ, సంక్షేమాధికారి జరీనాబేగం, సీఎంఓ బాలునాయక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

అడ్డాకుల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, వివిధ ప్రజా సంఘాల నాయకులు గ్రామాలలో స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఆరు నెలలుగా బలీదుపల్లిలోని ఎస్సీ కాలనీలో వీధిలైట్లు లేక దళితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లెల మాణిక్యం రాజు, ఎం.కుర్మయ్య ఆరోపించారు. గుడిబండ, తిమ్మాయిపల్లి గ్రామాల్లో దళితులు సాగు చేసుకుంటున్న భూములను అగ్రకుల పెత్తందారులు ఆక్రమించుకొని దౌర్జన్యంగా పట్టాలు చేసుకున్నందున వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో దళితులు వందల మంది ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారని, ఇళ్లు లేని దళితులకు ముందు ఇళ్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. బాలరాజు, ప్రసాద్, ప్రశాంత్, నాగవర్ధన్, అంజనేయులు, నర్సింహ్మా, కుమార్, నరేందర్, నాగరాజు, రాజేష్, శ్రీకాంత్ ఉన్నారు.

వెంకటస్వామికి ఘన నివాళి



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉద్యమ పితామహుడు అప్పారి వెంకటస్వామి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కోశాధికారి కిష్టయ్య అన్నారు. మంగళవారం వెంకటస్వామి వర్ధంతిని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిష్టయ్య మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషిచేశారన్నారు. హక్కులు, బాధ్యతలు ఉద్యమానికి రెండు నేత్రాలని నమ్మిన వ్యక్తి అప్పారి అని కొనియాడారు. పి.ఉమాదేవి, వి.భాస్కర్, మన్యం, కిష్ట్యానాయక్, హేమంత్, వేణుగోపాల్, జయంతి పాల్గొన్నారు.

నేడు తైబజార్ వేలం

నవాబుపేట: మండల కేంద్రంలో తైబజార్ వేలం బుధవారం నిర్వహిస్తున్నట్లు పంచాయ అధికారి నరేష్ తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వేలంలో పాల్గొనే వారు రూ.25వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలన్నారు. వేలం దక్కించుకున్నవారు ఏప్రిల్ 1వ తేదీ నుంచి తమ కార్యకలాపాలు ప్రారంభించాలని, వేలం దక్కిన వెంటనే 4వ వంతు డబ్బులు చెల్లించి పంచాయతీతో అగ్రిమెంట్ చేసుకోవాలన్నారు.

మంత్రివర్గంలో ముస్లింలకు అవకాశం కల్పించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర మంత్రివర్గంలో ముస్లింలకు అవకాశం కల్పించాలని అల్ ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని ముస్లిం జనాభా 12.56 శాతంగా ఉందన్నారు. దానికి అనుగుణంగా ముస్లింలకు స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ముస్లింలకు ప్రభుత్వంలో అధికార పదవులు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు.

చేనేత సంఘాల అభివృద్ధికి చేయూత



దేవరకద్ర: చేనేత సంఘాల అభివృద్ధికి చేయూత అందిస్తామని డీసీఓ శంకరాచారి తెలిపారు. మంగళవారం దేవరకద్ర మండలం వెంకటాయపల్లిలోని లక్ష్మీవెంకటేశ్వర ఉన్ని పారిశ్రామిక సహకార ఉత్పత్తి, అమ్మకం సంఘం భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత ఉన్ని పారిశ్రామిక కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సంఘాలు బలోపేతం కావడానికి తమ వంతుగా సహకారం అందిస్తామని తెలిపారు. డీసీఏఓ టైటాస్‌పాల్, చేనేత జౌళి సహాయ సంచాలకులు డి.బాబు, సహాయ అభివృద్ధి అధికారి విజయకుమార్, చేనేత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జీతాల కోసం కార్మికుల ఆందోళన

- బడ్జెట్ విడుదలై 40రోజులు దాటినా అందని వేతనాలు
- ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

జడ్చర్ల టౌన్: జీతాల కోసం కోసం ఏరియా ఆస్పత్రిలో పనిచేసే కార్మికులు ఆందోళన బాట పట్టారు. మంగళవారం విధులు బహిష్కరించి ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ విభాగాల్లో మొత్తం 35మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి అక్టోబర్ నెల నుంచి జీతాలు చెల్లించాల్సి ఉంది. గత నెలలో వివిధ దశల్లో పోరాటాలు చేసిన ఫలితంగా ఫిబ్రవరి 13న ప్రభుత్వం కార్మికుల జీతాలకు సంబంధించి 6నెలల బడ్జెట్ విడుదల చేసింది. అయినా ఏరియా ఆస్పత్రిలో కార్మికులకు మాత్రం అందలేదు. తమకు రావాల్సిన ఐదు నెలల జీతాలు చెల్లించాలని కార్మికులు విధులు బహిష్కరించి ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. దీంతో ఆస్పత్రిలో ఇబ్బందులు మొదలయ్యాయి. ఆస్పత్రి ఆర్ఎంఓ డా.హరినాథ్, కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి కార్మికులను పిలిచి చర్చలు జరిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సెలవులో ఉన్నందున బుధవారం చర్చిద్దామని ధర్నా విరమించాలని కోరారు. స్పందించిన కార్మికులు విధుల్లో చేరారు. మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ నిర్లక్ష్యంతోనే జీతాలు ఆలస్యమవుతున్నాయని ఆరోపించారు. ఏజెన్సి కాంట్రాక్టర్, సూపరింటెండెంట్ నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేశారు. తక్షణమే 5నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని లేదంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు నర్సింహ, నాగరాజ్, నవీన్, రాజేష్, రామకృష్ణ, విజయలక్ష్మి, మనెమ్మ, అలివేల, సుక్కమ్మ, భార్గవి, అంజమ్మ, నీరజ, లక్ష్మీనర్సమ్మ పాల్గొన్నారు.

వాగ్వాదం

ఆర్ఎంఓ డా.హరినాథ్, కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్‌ల మధ్య కాసేపు వాగ్వాదం కొనసాగింది. 40రోజుల కిందట బడ్జెట్ విడులైనా ఎందుకు జీతాలు వేయటం లేదని కాంట్రాక్టర్‌ను నిలదీయగా తనకు మూడు నెలల బిల్లు మాత్రమే వేశారని, మిగిలిన బిల్లు ఎందుకు వేయలేదో తెలియటం లేదన్నారు. సోమవారమే మిగిలిన బిల్లు వేసినట్లుని ఆర్ఎంఓ కాంట్రాక్టర్‌కు తెలిపారు. తనకు సమాచారం లేకుండా ఎందుకు, ఎలా వేశారని కాంట్రాక్టర్ మండిపడ్డారు. వేసిన బిల్లులోనూ నెల జీతాలు తక్కువగా ఉన్నాయని ఆరోపించారు. తనకు ఎందుకు విడతల వారీగా వేస్తున్నారని ప్రశ్నించారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి సూచించారు. మండలంలోని జమిస్తాపూర్, కోడూర్, తెలుగుగూడెంల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ.2 లక్షల లోపు రుణాలన్నింటిని మాఫీ చేసిందని, రైతు భరోసా ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సామాన్యుల పక్షాన నిలబడుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, ఖాజా పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఆందోళనలను ఆపలేరు

నవాబుపేట: శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు నిర్బంధిస్తే ఆందోళనలు ఆపలేరని ఆశాకార్యకర్తల సంఘం నాయకురాలు నిర్మల అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ముందు ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. తాము వేతనం కోసం తాము చేస్తున్న కష్టానికి ఫలితం ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడిగితే పోలీసులతో తమ ఉద్యమాన్ని అణిచివేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని ఆమె ఆరోపించారు. తమకు న్యాయం చేయకుంటే మరింత ఉధృతంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అరెస్ట్ చేయడం తగదు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా ఆశా కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. ప్రభుత్వ నిర్బంధం ఆపాలంటూ మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు.

28 నుంచి తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

కోయిల్‌కొండ: మండలంలోని చన్మన్‌పల్లిలోని తిరుమలనాథస్వామి కొండపై నెల 28, 29, 30వ తేదీల్లో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న శుక్రవారం స్వామివారిని కొండపై తీసుకెళ్లే కార్యక్రమం, 29న శనివారం స్వామివారికి అభిషేకం, తెల్లవారుజామున రథోత్సవం, 30న ఆదివారం శకటోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

ఘనంగా బోనాల

నవాబుపేట: మండల కేంద్రంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ దేవత బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాటుచేసి బోనాల ఊరేగింపులు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాంచంద్రపురం బోనాల పండుగతో కళకళలాడింది.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కడియాల మోహన్ డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించి, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని కోరుతూ మంగళవారం మాచన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.